క్లుప్తంగా

నేడు అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

నారాయణపేట రూరల్: పట్టణంలోని అయ్యప్పస్వామి, వైష్ణవిదేవి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 11:30 గంటలకు చల్లా నరేంద్రశర్మ, బాబు గురుస్వామి ఆధ్వర్యంలో మహా పడిపూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఉదయం 8గంటలకు బారంబావి శివాలయం నుంచి కలశం ఊరేగింపు, మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రసాద వితరణ, అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు మహా పడిపూజ

కోస్గి: పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వర, శివసాయి అయ్యప్ప ఆలయాల్లో శుక్రవారం మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం ప్రకటనలో తెలిపారు. స్థానిక భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి ఆలయం నుంచి పూర్ణ పుష్కలాంభ సమేత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి వారి పల్లకీసేవ ఉంటుందన్నారు. అనంతరం మహాపడి పూజ, మహామంగళ హారతి, అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

విద్యార్థులకు పాటల పోటీలు



మక్తల్: పట్టణంలోని భారతి విద్యానికేతన్ పాఠశాలలో గురువారం సోచా సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు స్వతహాగా పాటలు పాడి అందరినీ అలరించారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్ శ్వేత, ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ అరవింద్‌కుమార్, సొసైటీ సభ్యురాలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్టీయూ తెలంగాణ టీచర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోస్టుకు ఎన్నికలు నిర్వహించగా.. జాజాపూర్ ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ బాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయనను సన్మానించి, నియామక పత్రం అందజేశారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న విద్యారంగ సమస్యలపై దృష్టి సారిస్తామని, అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో పాలమూరు, నారాయణపేట జిల్లాల అధ్యక్షులు బాలరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'రైతుబంధు'కు దరఖాస్తు చేసుకోండి

నర్వ: మండలంలో కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన వారు రైతుబంధు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ గణేష్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. నవంబర్ 17వ తేదీలోగా భూ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు పథకంలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కూడిన దరఖాస్తును ఆయా గ్రామాల ఏఈఓలకు అందజేయాలని సూచించారు. కాగా యాసంగి సీజన్ పూర్తయ్యేలోపు అందరి ఖాతాల్లో రైతుబంధు నిధులు జమ అవుతాయని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మొబైల్ ఫోన్‌కు మెసేజ్ వచ్చిన తర్వాతే బ్యాంక్‌కు వెళ్లాలని కోరారు.

మైసూర్ ఎంపీని సస్పెండ్ చేయాలి

ఆత్మకూర్: పార్లమెంట్‌లో అగంతకులు చొరబడి అలజడి సృష్టించిన వారికి పాస్‌లు ఇచ్చిన మైసూర్ ఎంపీ ప్రతాప్ సింహాను సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, కార్యదర్శి రహ్మతుల్లా మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీలు తప్పుచేస్తే అది తప్పే కాదని విపక్షాలకు చెందిన ఎంపీలపై ఆరోపణలు వస్తే చర్యలు తీసుకుంటారని దుయ్యబట్టారు. గతంలో రాహుల్‌గాంధీపై అనర్హతవేటు వేశారని, నివాసమున్న ఇంటి నిసైతం లాక్కున్నారని, ఈ మధ్యనే ఎంపీ మహువా మొయిత్రపై నిరాధారమైన ఆరోపణలతో చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగిన రోజునే ఘటన జరగడం భద్రతా వైఫల్యాలు పాలకుల నిర్లక్ష్యమేనని అన్నారు. విపక్షాలకు చెందిన ఎంపీలు అగంతకులకు పాస్‌లను ఇచ్చి ఉంటే రాద్ధాంతం చేసేవారని, మీడియా అదే పనిగట్టుకుని కోడై కూసేదని దుయ్యబట్టారు. బీజేపీ ఎంపీని సస్పెండ్ చేసి, ఘటనకు బాధ్యత వహించి హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

సా..గుతున్న రోడ్డు పనులు



గుంతలమయంగా మారిన మక్తల్-నారాయణపేట ప్రధాన రహదారి

- నత్తనడకన మక్తల్ -నారాయణపేట రోడ్డు నిర్మాణం
- గోతుల రహదారిపై రాకపోకలు సాగించలేక అవస్థలు
- పట్టించుకోని అధికారులు

మక్తల్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా మారింది మక్తల్-నారాయణపేట రోడ్డు పరిస్థితి. గుంతలమయంగా మారిన రోడ్డు మరమ్మతుకు ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేసి నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. అధికారుల ఉదాసీనత.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రోడ్డు నిర్మాణం నత్తనకడన సాగుతోంది. రోడ్డు మొత్తం కంకర కుప్పలకే పరిమితమైంది. దీంతో గుంతలమయంగా మారిన రోడ్డుపై రాకపోకలు సాగించలేక వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. దారి పొడవునా ఏర్పడిన గుంతలను పూడ్చకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మక్తల్ నుంచి నారాయణపేటకు 30 కి.మీ. దూరం ఉంది. ఈ రహదారిపై 45 నిమిషాల్లో గమ్యాన్ని చేరుకోవాల్సి ఉన్నప్పటికీ గంటన్నర సమయం పడుతోంది. మక్తల్ మండలం లింగంపల్లి నుంచి ఊట్కూర్ మండలం తిప్రాస్‌పల్లి స్టేజీ వరకు రోడ్డు మొత్తం గోతులమయంగా మారడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

గ్రామీణ రోడ్లకు మరమ్మతులు కరవు..

మక్తల్ మండలం జక్లేర్ నుంచి పులిమామిడి రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు గుంతలను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. బీటీరోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. అదేవిధంగా మక్తల్ మండలం దాసర్‌దొడ్డి, కాట్రేవ్‌పల్లి గ్రామాలకు బీటీరోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆయా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయా రోడ్లకు కనీసం మరమ్మతు చేయించాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే పనులు చేపడుతాం..

మక్తల్-నారాయణపేట రహదారికి రూ.9కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పూర్తయ్యాయి. పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. మల్లేపల్లి స్టేజీ నుంచి తిప్రాస్‌పల్లి వరకు రోడ్డు మరమ్మతు చేపడుతాం. నిధులు మంజూరైన గ్రామాల రోడ్ల పనులను పూర్తి చేస్తాం.

– మౌర్య, ఆర్‌అండ్‌బీ ఏఈ, మక్తల్

రోడ్డును బాగుచేయాలి..



మక్తల్ నుంచి నారాయణపేటకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. మల్లేపల్లి వద్ద రహదారిపై ఏర్పడ్డ గోతులతో ప్రమాదాలకు గురవుతున్నాం. గుంతల రోడ్డుపై ప్రయాణానికి ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి.

– గాళ్ల నర్సింహులు, పెద్దపొర్ల, ఊట్కూర్ మండలం

గోతులను పూడ్చివేయాలి..



మక్తల్ నుంచి నారాయణపేటకు వెళ్లే రహదారిపై ఏర్పడ్డ గోతులను వెంటనే పూడ్చివేయాలి. రోడ్డుపై గోతులు ఏర్పడటంతో రాకపోకలు సాగించలేకపోతున్నాం. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రోడ్డుపై ఏర్పడిన గోతులను పూడ్చివేయాలి.

– సొప్పు నర్సిరెడ్డి, ఊట్కూర్

కాంట్రాక్టర్లు పనులు చేయడంలేదు..



గ్రామాల బీటీరోడ్ల నిర్మాణానికి కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కొన్ని పనులు ముందుకు సాగడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల పనులు త్వరగా చేపట్టాలి.

– కిరణ్, మక్తల్

అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మొద్దు



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ ఉస్మాన్

మద్దూరు: అపరిచిత వ్యక్తుల మాటలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని ఏఎస్‌ఐ ఉస్మాన్ అన్నారు. మండలంలోని పల్లెర్ల ఉన్నత పాఠశాలలో గురువారం సైబర్ నేరాలపై పోలీసు కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ రోజురోజుకూ సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతున్న నేపథ్యంలో.. అదే స్థాయిలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోతే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో బాల్యవివాహాలను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలన్నారు. మహిళలు, బాలికలను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించాలి



కోస్గిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



కోయిల్‌కొండలో..

కోస్గి: ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18ఏళ్లు నిండిన యువతీ యువకుల పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయాలని సూచించారు. గతంలో వచ్చిన అభ్యంతరాలు, సవరణలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను బీఎల్‌ఓలు ఇంటింటికెళ్లి పరిష్కరించాలని తెలిపారు. 90ఏళ్లు పైబడిన వృద్ధుల వివరాలను జాబితాలో ప్రత్యేకంగా గుర్తించాలన్నారు. నూతన ఓటర్ల జాబితాకు సంబంధించి అర్హులైన వారందరి నుంచి దరఖాస్తులు తీసుకోవాలని, అవసరమైతే దరఖాస్తుల ఆధారంగా బీఎల్‌ఓలు క్షేత్ర స్థాయిలో మరోమారు పర్యటించి అవకతవకలకు తావు లేకుండా జాబితాను రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా ఎలాంటి తప్పులకు తావివ్వొద్దని తెలిపారు. సమావేశంలో జూనియర్ అసిస్టెంట్ బుగ్యాసాబ్ తదితరులు ఉన్నారు.

కోయిల్‌కొండ: వచ్చేనెల 1 వరకు గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు నమోదు చేయించాలని తహసీల్దార్ భరత్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రానున్న గ్రామపంచాయతీ, ఎంపీ, సింగిల్ విండో ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నమోదుకు చర్యలు చేపట్టాలని సూచించారు. లిస్టులో డబుల్ పేర్లు ఉన్నవాటిని, మృతిచెందిన వారి పేర్లను తొలగించాలని పేర్కొన్నారు. డీటీ మురళీ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ శ్రీదేవి

నారాయణపేట రూరల్: విద్యార్థులు విజ్ఞత వీడి ర్యాగింగ్ వంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఏఎస్‌ఐ శ్రీదేవి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. అనవసరంగా తప్పుడు పనులు చేస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని, తద్వారా భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. మహిళలు, బాలికలను ఎవరైనా ఈవ్‌టీజింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100 లేదా మహిళా హెల్ప్‌లైన్ 7901022492 నంబర్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలను అరికట్టడానికి సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని తెలిపారు. అమ్మాయిలకు గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలిసి ఉండాలన్నారు. అమ్మాయిలతో పాటు మగపిల్లల్లోనూ మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్టుపై వెలగని లైట్లు

అమరచింత: జూరాల ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన బల్బులు వెలగని కారణంగా రహదారి రాత్రి వేళ చీకటిగా మారుతుంది. ప్రాజెక్టు రహదారి నుంచి కర్ణాటక రాష్ట్రానికి వెళ్లడానికి రోడ్డుమార్గం ఉండటంతో ప్రయాణికులు రాత్రి వేళ వెళ్లేందుకు జంకుతున్నారు. ఎడమ కాల్వ సమీపంలో చేపలు పట్టి విక్రయించే జాలర్లతో పాటు చేప వంటకాలు తయారుచేస్తున్న వారుసైతం సాయంత్రం అయ్యిందంటే ఇంటి ముఖం పట్టే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రాజెక్టు అధికారులు స్పందించి రాత్రి వేళ బల్బులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ప్రాజెక్టుపై వృథాగా ఉన్న విద్యుత్ స్తంభాలు

తాగునీరు కలుషితం



మరికల్: మండల కేంద్రం సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కావడంతో తాగునీరు కలుషితమవుతోంది. పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు వృథా కావడంతో పాటు కలుషితమవుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



మాగనూర్: మండలంలోని మందిపల్లి ప్రధాన చౌరస్తాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్లపొదలు, తీగజాతి మొక్కలు అల్లుకుపోవడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే మోటరు కూడా ఇక్కడే ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ముళ్లపొదలను తొలగించి కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వీధి దీపాల సమస్య పరిష్కరించాలి

నర్వ: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని సర్పంచులు కోరుతున్నారు. వీధిదీపాల నిర్వహణను ప్రైవేటు కాంట్రాక్టర్‌కు అప్పగించిన నేపథ్యంలో ఏదేని సమస్య తలెత్తితే స్పందించడం లేదని పేర్కొంటున్నారు. వీధిదీపాల నిర్వహణ కొరవడటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

బంగారు నగలపై 85 శాతం రుణాలు

అమరచింత: తమ బ్యాంకు బంగారు నగలను తాకట్టు పెడితే 85 శాతం రుణాలను అందిస్తున్నామని యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్యాంసుందర్ అన్నారు. రైతులతో పాటు వ్యాపారస్తులకు యూనియన్ బ్యాంకు చక్కటి అవకాశం అందిస్తున్నదన్నారు. తక్కువ వడ్డీతో రుణాన్ని చెల్లించే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు పరిధిలోని నర్వ, అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో గురువారం ఆటోలో ప్రచారం నిర్వహించి రుణ వివరాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశామన్నారు.

నిరుపయోగంగా అటల్ ల్యాబ్

ధన్వాడ: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ ల్యాబ్ నిరుపయోగంగా మారింది. 2018లో రూ.12లక్షలు వెచ్చించి అటల్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం నిర్వహణ కొనసాగగా.. ఆ తర్వాత నిధుల లేమితో వినియోగించడం లేదు. నాలుగేళ్లుగా ల్యాబ్ నిరుపయోగంగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులలో నైపుణ్యం వెలికితీసేందుకు ఏర్పాటు చేసిన అటల్ ల్యాబ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



మోడల్ పాఠశాలలో వృథాగా ఉన్న అటల్ ల్యాబ్

పురాతన కట్టడాలను కాపాడాలి

మాగనూర్: మండలంలోని మందిపల్లిలో పురాతన కట్టడాలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలోని బురుజు శిథిలావస్థకు చేరుకుంటుందని తెలిపారు. వందల ఏళ్ల నాటి చారిత్రాత్మక కట్టడాల ప్రాముఖ్యత రాబోవు తరాలకు తెలియపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాంతానికి ఎంతో చరిత్ర ఉందని.. ప్రపంచ ప్రఖ్యాతి కలిగిన కోహినూర్ వజ్రం కూడా కొల్లూర్ ప్రాంతంలో లభించిందని పేర్కొంటున్నారు. అలాంటి చరిత్ర కలిగిన ఈ ప్రాంతంలో పురాతన కట్టడాలను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన మందిపల్లి బురుజు →



మక్తల్‌లో హడలెత్తిస్తున్న దొంగలు

మక్తల్: మక్తల్ పట్టణంలో గుర్తు తెలియని దుండగులు వరుస చోరీలకు పాల్పడుతూ ప్రజలను హడలెత్తిస్తున్నారు. తాళం వేసిన ఇళ్లతో పాటు ఒకరిద్దరు నివాసముండే ఇళ్లను దొంగలు టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల సినీఫక్కీలో ఓ మహిళను కత్తితో బెదిరించి రూ.5.50 లక్షలు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. పట్టణంలో జరుగుతున్న చోరీలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో పలు కాలనీల యువకులు కాపలా కాస్తున్నారు. ఏదేని అలికిడి వినిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇస్తున్నారు. అదేవిధంగా సీఐ రాంలాల్, ఎస్‌ఐ పర్వతాలు ఆధ్వర్యంలో పోలీసులు గస్తీని ముమ్మరం చేశారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పూర్తి వివరాలు తెలుసుకుంటున్నారు. ఏదేమైనప్పటికీ దొంగలు వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.



మక్తల్‌లో అనుమానిత వ్యక్తుల వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

అభివృద్ధే లక్ష్యంగా ముందుకుసాగాలి

కోయిల్‌కొండ: పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా కార్యదర్శులు పనిచేయాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. గురువారం బుర్గుపల్లి, శేరివెంకటాపూర్, చిన్నలింగల్‌ఖేడ్, సూరారం, మల్లాపూర్, కొత్లాబాద్ గ్రామాల్లో పర్యటించారు. రికార్డులను తనిఖీ చేశారు. అదేవిధంగా నర్సరీల్లో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏపీఓ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాములు

బిందుసేద్యంతో మేలు

- డ్రిప్ పద్ధతిలో ఎరువుల యాజమాన్యం
- నాణ్యమైన అధిక దిగుబడులకు మేలైన పద్ధతి

మదనాపురం: నీటిలో కరిగే ఎరువులను డ్రిప్ ద్వారా మొక్కలకు అందించే విధానంతో రైతులకు మేలు చేకూరుతుంది. దీనినే ఫర్టిగేషన్ పద్ధతి అంటారని కేవీకే యాంత్రీకరణ శాస్త్రవేత్త మస్తానయ్య తెలిపారు. ఫర్టిగేషన్ పద్ధతిపై ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులు ప్రస్తుత తరుణంలో అధిక నాణ్యత సురక్షిత ఆహార ఉత్పత్తి కోసం పెరుగుతున్న డిమాండ్లను చేరుకోవడానికి విశేషంగా కృషి చేస్తున్నారు. వ్యవసాయంలో నీటి పారుదల ద్వారా రసాయనిక ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో భూగర్భ భూ ఉపరితలంపై పోషకాల ఉధృతి పెరిగి పర్యావరణ కాలుష్యానికి దారి తీస్తుంది. అందుకే నీటిలో కరిగే రసాయనిక ఎరువులను డ్రిప్ పద్ధతిని ఉపయోగించి మొక్క వేర్లు ఉన్న చోట ఇవ్వడం ద్వారా పోషకాలు సమృద్ధిగా అందుతాయి. మొక్కలు బలంగా ఉంటాయి. ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుంది. సాగు నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ఫర్టిగేషన్ పద్ధతి ఎంతో దోహదపడుతుంది. విచక్షణ రహితంగా ఎరువులు వాడకుండా సరైన పద్ధతుల్లో ఎరువులు, నీటి వినియోగంతో సాగు చేసుకోవచ్చు. గతంలో ప్రభుత్వం ఫర్టిగేషన్ యంత్రాలు సబ్సిడీపై అందించింది. రైతులు సరిగా వినియోగించకపోవడంతో చాలా చోట్ల నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇలా వదిలేయడంతో యంత్రాలు పూర్తిగా దెబ్బతిని పని చేయకుండా పాడైపోతాయి. రానున్న రోజుల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కూరగాయల సాగు, రైతులు నీటి యాజమాన్య పద్ధతులు సక్రమంగా అవలంబిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.



డ్రిప్ ద్వారా నీటి పంపిణీ విధానం

రసాయన ఎరువుల ఆదా

పంట దిగుబడి 20–30 శాతం పెరుగుతుంది. ఖచ్చితమైన రీతిలో ఎరువులు సరఫరా చేయవచ్చు. మొక్కల అవసరాలను బట్టి పోషకాలు అందించవచ్చు. పోషక నష్టాలను తగ్గిస్తుంది. స్థూల, సూక్ష్మ పోషకాలు ఒకే సారి మొక్కకు అందించవచ్చు. ఎరువులు అవసరైన మోతాదులో ఇవ్వవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నీటిలో కరిగే ఎరువులు మాత్రమే డ్రిప్ ద్వారా ఇవ్వాలి. మోతాదుకు మించి ఇవ్వకూడదు, ఇస్తే పంట దెబ్బ తింటుంది. అంతే కాకుండా పోషకాల వడపోత జరిగి భూగర్భ జలాలు కలుషితం అవుతాయి. రసాయనిక ఎరువుల కలయిక గురించి అవగాహన ఉండాలి. నీటి పంపిణీ చేసే పరికరాలు తుప్పు పట్టకుండా చూసుకోవాలి. డ్రిప్ నీటిని ఎప్పుడు తాగునీటిగా వినియోగించవద్దు.

రైతులను మభ్యపెడుతున్న దళారులు

- తక్కువ ధరకే పత్తి కొనుగోలు!

నవాబుపేట: పత్తికి మద్దతు ధర ఇవ్వాలని రైతులు ఒకవైపు డిమాండ్ చేస్తుంటే మరో పక్క దళారులు గ్రామాల్లో అక్రమంగా కొనుగోలు చేస్తూ వారిని మోసం చేస్తున్నారు. అక్రమంగా గ్రామాలకు వెళ్లి ఇష్టానుసారంగా ధర చెల్లించి తీవ్రంగా నష్టపరుస్తున్నారు. పత్తిని మార్కెట్‌కు తరలించాలంటే దూరభారం అవుతుందని, తరలింపునకు ఖర్చులుంటాయని, సమయం వృథా అవుతుందని పలు సాకులు చూపించి రైతులను మభ్యపెడుతున్నారు. రూ. మూడు నుంచి రూ. నాలుగు వేలకు క్వింటాల్ తీసుకుంటున్నారు. దీనిపై అధికారులు సైతం నోరు మెదపడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలైన పోమాల్, కేశవరావుపల్లి, చౌదూర్, మరికల్, కొల్లూర్ గ్రామాల్లో గుట్టు చప్పుడు కాకుండా పత్తి కొనుగోలు చేస్తున్నారని సమాచారం. కాగా అధికారులు చర్యలు చేపట్టి రైతులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.



పోమాల్‌లో పత్తి తరలింపు

గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థికి అభినందన

గండేడ్: వాలీబాల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారుడిని గోల్డ్‌మెడల్ వరించింది. వివరాల్లోకి వెళితే ఈనెల 11వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పోటీలు నారాయణపేట్‌లో జరిగాయి. సల్కర్‌పేట్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న గిరమోని శివకుమార్ అండర్ 14 వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నాడు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈమేరకు గురువారం సల్కర్‌పేట్ పాఠశాలలో శివకుమార్‌కు సన్మానం చేశారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పీడీ అబ్దుల్లా బిన్ హైమద్ పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న హెచ్‌ఎం విజయలక్ష్మి